2011- 12 కేంద్ర వార్షిక బడ్జెట్... విశ్లేషణ

బడ్జెట్.. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకం. ఆదాయ వ్యయాలు, ఆయా రంగాలకు కేటాయింపులు, పెట్టుబడుల అంచనాలతో రూపొందే బడ్జెట్‌పై.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ప్రతి అభ్యర్థికి అవగాహన ఎంతో అవసరం. ముఖ్యంగా గణాంకాల పరంగా సమాచారాన్ని పొందుపరచుకోవడం లాభిస్తుంది. ఈ నేపథ్యంలో 2011-12 కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణ..



గత ఆర్థిక సంవత్సరం (2010-11)లో స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు 8.6 శాతం; వ్యవసాయ రంగం 5.4 శాతం; పారిశ్రామిక రంగం 8.1 శాతం; సేవా రంగం 9.6 శాతం వృద్ధి సాధించిన నేపథ్యంలో కేంద్ర ఆర్థిక ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ 2011-12 వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టారు. స్వదేశీ, విదేశీ షాక్స్ (ఉత్పాతాలను) తట్టుకుని ఆర్థికవ్యవస్థ పురోగమించిందని ప్రణబ్ ముఖర్జీ అభిప్రాయపడ్డారు. ఆహార ద్రవ్యోల్బణం కొంత మేర తగ్గినా రాబోయే కాలంలో తిరిగి పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో కేంద్ర బ్యాంకు అవలంబించిన ద్రవ్య విధానాలు విజయవంతమయ్యాయి. ఆర్థికమంత్రిత్వ శాఖలో స్వతంత్ర 'రుణ యాజమాన్య కార్యాలయం' ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఆహ్వానించదగింది. అయిదంచెల వ్యూహం ద్వారా నల్ల ధనాన్ని నియంత్రిస్తూ.. అంతర్గత పన్ను వ్యవస్థను పటిష్టం చేస్తే విదేశాల్లో దాచుకున్న సొమ్ము కూడా పన్ను పరిధిలోకి రాగలదు. దీని కోసం అవలంబించాల్సిన విధానాలు, వ్యూహాల రూపకల్పనకు ప్రభుత్వం కొన్ని సంస్థల సహకారం తీసుకోవాలి. ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్స్‌కు మైక్రో ఫైనాన్స్ సంస్థలు సాధనాలుగా పనిచేస్తాయి. చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకుతో కలిసి ₹100 కోట్ల తో 'ఇండియా మైక్రో ఫైనాన్స్ ఈక్విటీ ఫండ్'ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఆహ్వానించదగింది. ₹500 కోట్ల కార్పస్‌తో 'మహిళా స్వయం సహాయక బృందాలు' ఏర్పా టు చేయడం మహిళా సాధికారతను పెంపొందించగలదు. అవస్థాపనా రంగానికి ₹ 2,14,000 కోట్లు కేటాయించి ఆ రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ప్రణాళిక వ్యయంలో స్థూల బడ్జెటరీ మద్దతులో దీని వాటా 48.5 శాతం. ప్రత్యక్ష పన్నుల విషయంలో ఎలాంటి ముఖ్య మార్పులు లేకున్నా 'ప్రత్యక్ష పన్నుల కోడ్'ను ఏప్రిల్ 1, 2012 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించారు. స్వాతంత్ర్యానంతరం ఎక్కు వ కాలం నష్టాలు ఎదుర్కొని భారంగా మారిన ప్రభుత్వ రంగ సంస్థలు ఇటీవల ఇష్యూ చేసిన పబ్లిక్ ఇష్యూలకు మంచి ఆదరణ లభించడం ఆహ్వానించదగింది.

బడ్జెట్.. వివిధ రంగాలు:

ఎక్సైజ్ డ్యూటీ విషయంలో ఎలాంటి మార్పు లేదు. అందువల్ల ఆటో మొబైల్ పరిశ్రమ మంచి వృద్ధి సాధించగలదని మారుతి చైర్మన్ ఆర్.సి. భార్గవ అభిప్రాయపడ్డారు. క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల ఆటో రంగంపై కొంత మేర ప్రతికూల ప్రభావం చూపించినా.. ఆ ప్రభావం దీర్ఘకాలంలో కార్ల అమ్మకాలపై ఉండకపోవచ్చు. ఇంధన సామర్థ్యం ఎక్కువున్న చిన్న కార్లకు డిమాండ్ పెరుగుతుందని ఆయన అభిప్రాయం. కూరగాయలు, పండ్లు, మాంసం, పౌల్ట్రీ, ఫిషింగ్ రంగాల్లో ఉత్పత్తి, పంపిణీల్లో ఎదురయ్యే అడ్డంకులను తొలగిస్తారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజనకు కేటాయింపులను ₹ 6755 కోట్ల నుంచి ₹ 7860 కోట్లకు పెంచారు. తూర్పు ప్రాంతాల్లో హరిత విప్లవం రావాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ఇందుకోసం ₹ 400 కోట్లు కేటా యించారు. రెయిన్‌ఫెడ్ ప్రాంతాల్లో పప్పు ధాన్యాలు పండించే 60,000 గ్రామాల్లో వాటి ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ₹ 300 కోట్లు కేటాయించారు. రాబోయే అయిదేళ్ల కాలంలో సగటున ప్రతి ఏటా పామాయిల్ దిగుబడి 3 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్గానిక్ ఫార్మింగ్ పద్ధతులను అవలంబించే దిశగా ఆధునిక పరిజ్ఞానాన్ని సంప్రదాయ వ్యవసాయ కార్యకలాపాల్లో మిళితం చేయాలని నిర్ణయించింది. నాబార్డ్ అందించే స్వల్పకాల గ్రామీణ పరపతి నిధికి ₹ 10,000 కోట్లు కేటాయించారు. 2011-12లో 15 మెగా ఫుడ్ పార్కులను ఏర్పాటు చేయనున్నారు.

ముఖ్య అవస్థాపనా సౌకర్యాలైన రైల్వే, పోర్టులు, హైవేల్లో సామర్థ్యం పెంపులో ఏర్పడే అడ్డంకులు తొలగించడానికి 2011-12లో వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు ₹30,000 కోట్ల విలువైన ట్యాక్స్ ఫ్రీ బాండ్లను విడుదల చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. అవస్థాపనా సౌకర్యాల కల్పనలో విదేశీ నిధుల ఆకర్షణకు పలు ప్రోత్సాహకాలు ప్రకటించింది. పట్టణ రవాణా, తక్కువ వ్యయంలో గృహ నిర్మాణం అనే రెండు అంశాలకు సంబంధించి 'ప్రైవేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థల' నుంచి అదనపు డిమాండ్ ఏర్పడే విధంగా ఈ రెండు రంగాలు తగిన సామర్థ్యం కలిగున్నాయని భావిస్తోంది. ఢిల్లీ మెట్రో ఫేజ్-3, ముంబై మెట్రోలైన్-3 పనులు ప్రారంభంతోపాటు ఇప్పటికే నిర్మాణంలో ఉన్న బెంగళూరు, కోల్‌కతా, చెన్నైల్లోని మెట్రో ప్రాజెక్టుల సత్వర నిర్మాణానికి తగిన ఆర్థిక సహాయం అందిస్తుంది.

విద్య, ఉపాధి:

గత సంవత్సరంతో పోల్చితే ఈ బడ్జెట్‌లో విద్యా రంగానికి 24 శాతం అదనంగా ₹ 52,047 కోట్లు కేటాయించారు. భవిష్యత్ శ్రామికుల్లో

ఉపాధి పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకమైన 'వొకేషనలైజేషన్ ఆఫ్ సెకండెరీ ఎడ్యుకేషన్'ను 2011-12 నుంచి అమలు చేస్తారు.

ప్రస్తుతం స్థూల దేశీయోత్పత్తిలో తయారీ రంగం వాటా 16 శాతం. కాగా దీన్ని రాబోయే పదేళ్ల కాలంలో 25 శాతానికి పెంచాలని భావిస్తోంది. టెక్స్‌టైల్స్‌కు సంబంధించి ముడి సిల్క్‌పై , కాటన్ వేస్ట్, నూలు తయారీలో వినియోగించే మాధ్యమిక వస్తువులపై; మాధ్యమిక రసాయనాలపై, రేయాన్ గ్రేడ్ ఉడ్, వేస్ట్ పేపర్‌పై విధించే కస్టమ్స్ డ్యూటీ తగ్గించారు. ఐటీ, ఐటీ అనుబంధ పరిశ్రమలకు సంబంధించి ప్రత్యేకమైన ప్రతిపాదనలు లేవు. అయితే ప్రత్యేక ఆర్థికమండళ్ల అభివృద్ధిదారులపై, ఈ మండళ్లలో ఏర్పాటైన యూనిట్లపై 'కనీస ప్రత్యామ్నాయ పన్ను' (ఎంఏటీ) 18.5 శాతంగా నిర్ణయించారు. ఈ చర్య ఐటీ రంగ వృద్ధిపై రుణాత్మక ప్రభావం చూపించే అవకాశం ఉంది.

సమ్మిళిత వృద్ధి:

పదకొండో పంచవర్ష ప్రణాళిక లక్ష్యమైన సమ్మిళిత వృద్ధి సాధన దిశగా సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా.. అన్ని రంగాలకు వనరుల పంపిణీ చేసే కృషిలో భాగంగా అవసరమైన చర్యలు తీసుకున్నారు. సాంఘిక రంగానికి ₹1,60,887 కోట్లు(ప్రణాళిక వ్యయం లో 36.4 శాతం) కేటాయించారు. గత ఏడాదితో పోల్చితే ఇది 17 శాతం ఎక్కువ. ఈ సంవత్సరం 'జాతీయ ఆహార భద్రతాబిల్లు'ను పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం, ఉపాధి పెరుగుదలకు ఈ పథకాలు దోహదపడతాయి. 'భారత్ నిర్మాణ్' పథకానికి బడ్జెట్లో ₹ 58,000 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో రాబోయే మూడేళ్లలో 2,50, 000 పంచాయతీలకు 'గ్రామీణ బ్రాడ్ బ్యాండ్ కనక్టివిటీ' అందించాలని ప్రతిపాదించారు. సర్వశిక్ష అభియాన్ పథకానికి ₹ 21,000 కోట్లు కేటాయించారు. ఆరోగ్య రంగానికి గత ఏడాదితో పోల్చితే 20 శాతం పెరిగి ₹ 26,760 కోట్లకు చేరుకుంది.

ముఖ్యాంశాలు

- 2011-12 కేంద్ర బడ్జెట్ మొత్తం వ్యయం: ₹ 12,57,729 కోట్లు.
- 2011-12 లో స్థూల పన్నుల రాబడి అంచనా: ₹ 9,32,440 కోట్లు.
- 2011-12లో పన్నేతర రాబడి అంచనా: ₹ 1,25,435 కోట్లు.
- 2010-11లో మొత్తం పన్నుల రాబడిలో ప్రత్యక్ష పన్నుల వాటా 56.68 శాతం. కాగా, పరోక్ష పన్నుల వాటా 43.08 శాతం
- 2011-12 బడ్జెట్‌లో మొత్తం పన్నుల రాబడిలో ప్రత్య క్ష పన్నుల వాటా 57.12 శాతంగా, పరోక్ష పన్నుల వాటా 42.66 శాతంగా ఉంటుందని అంచనా.
- పన్ను-జీడీపీ నిష్పత్తి 2010-11లో 9.7 శాతం. కాగా 2011-12లో 104 శాతంగా, 2012-13 లో 10.8 శాతంగా ఉండగలదని అంచనా.
- 2011-12లో రైతులకు పరపతి ₹ 4,75,000 కోట్లు.
- పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం ₹ 40,000 కోట్లు.
- స్థూల మార్కెట్ రుణాలు ₹ 4.17 ట్రిలియన్లు.
- నికర మార్కెట్ రుణాలు ₹ 3.43 ట్రిలియన్లు.
- 2010-12 సవరించిన అంచనా ప్రకారం స్థూల మార్కెట్ రుణం ₹ 4.47 ట్రిలియన్లు.
- 2010-11లో ద్రవ్యలోటు జీడీపీలో 5.1 శాతం.
- 2011-12లో ద్రవ్యలోటు జీడీపీలో 4.6 శాతం.
- 2013-14లో ద్రవ్యలోటు అంచనా 3.5 శాతం.
- 2011-12 నాటికి రెండు వేల పైచిలుకు జనాభా ఉన్న 73,000 హాబిటేషన్లలో బ్యాంకింగ్ సౌకర్యాల కల్పన
- నేషనల్ క్లీన్ ఎనర్జీ ఫండ్ నుంచి 'గ్రీన్ ఇండియా మిషన్'కు ₹ 200 కోట్లు.
- వెనుకబడిన ప్రాంతాల గ్రాంట్ ఫండ్‌కు వనరుల కేటాయింపులో 36 శాతం పెరుగుదల.
- సేవలపై పన్ను విషయంలో కొత్త ప్రతిపాదనల ద్వా రా నికర రెవెన్యూ రాబడి ₹4000 కోట్లుగా అంచనా.
- ప్రత్యక్ష పన్నులకు సంబంధించిన కొత్త ప్రతిపాదనల వల్ల రెవెన్యూ నష్టం ₹ 11,500 కోట్లు. కాగా పరోక్ష పన్నుల కొత్త ప్రతిపాదనల ద్వారా నికర రెవెన్యూ రాబడి అంచనా ₹ 11,300.
- 2011-12 బడ్జెట్‌లో సబ్సిడీల వ్యయం ₹1,43,570 కోట్లు.
- 2010-11 బడ్జెట్‌లో సబ్సిడీల వ్యయం ₹1,64,153 కోట్లు. ఇందులో ఆహార సబ్సిడీ వ్యయం వాటా ఎక్కువ.
- నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌కు ₹ 17840 కోట్లు.
- మధ్యాహ్న భోజన పథకానికి ₹ 10,380 కోట్లు.

పన్ను వసూళ్లు- గణాంకాలు

అంశం	2009 - 10	2010 - 11 (ఆర్ఈ)	2011-12 (బీఈ)
స్థూల పన్ను రాబడి (కోట్లలో)	6,24,527	7,86,888	9,32,440
వృద్ధి (శాతంలో)	3.0	26.0	18.0
ఎక్సైజ్ పన్ను రాబడి (కోట్లలో)	1,03,621	1,36,778	1,64,116
ఎక్సైజ్ పన్ను రాబడి వృద్ధి (శాతం	-4.6	33.0	19.0
కస్టమ్స్ సుంకం (కోట్లలో)	83,324	1,31,800	1,51,700
కస్టమ్స్ సుంకం రాబడి వృద్ధి (శాతం)	- 16.6	58.2	15.1
సేవలపై పన్ను రాబడి (కోట్లలో)	58,422	69,400	82,000
సేవలపై పన్ను రాబడి వృద్ధి (శాతం)	-4.1	18.8	18.2
కార్పొరేషన్ పన్ను రాబడి (కోట్లలో)	2,44,725	2,96,377	3,59,990
కార్పొరేషన్ పన్ను రాబడి శాతం	14.7	21.1	21.5
ఆదాయపు పన్ను రాబడి (కోట్లలో)	1,32,315	1,49,066	1,72,026
ఆదాయపు పన్ను రాబడి శాతం	24.8	12.7	15.4

అభివృద్ధి చెందిన దేశాల్లో పన్ను-జీడీపీ నిష్పత్తి 30 నుంచి 40 శాతం మధ్య ఉండగా, మన దేశంలో ఈ నిష్పత్తి (జీడీపీలో పన్ను వాటా) 2010-11లో 9.7 శాతంగా ఉంది. 2011-12లో 10.4 శాతంగా ఉండగలదని అంచనా. సమాజంలో ఎలాంటి లబ్ధి పొందలేని వర్గాలపై ఎటువంటి భారం లేకుండా పన్ను-జీడీపీ నిష్పత్తి పెంచుకోవడానికి ప్రభుత్వం కృషి చేయాలి.